నేడు నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో ఈ నెల 14న (నేడు) బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ హాజరై ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఇన్‌చార్జిలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటాం

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



పటాన్ చెరు టౌన్: బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్ చెరు డివిజన్‌లోని జేపీ కాలనీలో పార్టీ కోసం కష్టపడుతున్న 18 మంది మహిళా కార్యకర్తలకు స్కూటీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్టీ గత రెండు దఫాలుగా అధికారంలోకి రావడానికి మహిళా కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం మహిళా కార్యకర్తలు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం ఎంతో శ్రమించామని, ఎవరూ సరైన గుర్తింపు ఇవ్వలేదని, కానీ కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ గుర్తించి ఎలక్ట్రికల్ స్కూటీలు అందజేయడం సంతోషంగా ఉందని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హనుమాన్ చాలీసా



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కోదండ సీతా రామస్వామి దేవాలయంలో ఆదివారం భజరంగ్‌దళ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ కమిటీ సభ్యులు మధురనేని శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్, భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మతిస్థిమితంలేని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఐనోల్ గ్రామానికి చెందిన మల్లమ్మ భర్త మహిపాల్ గత 14 సంవత్సరాల నుంచి మతిస్థిమితం సరిగ్గాలేక డివిజన్ పరిధిలోని కిందిబస్తీలో అతని అమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చిన్నవాగు సమీపంలోని శ్మశాన వాటిక రోడ్డు పక్కన పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

మోతీనగర్: శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించిన కాలంలో ప్రజలు అన్ని విధాలుగా సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండేవారని సుందర కేశవరావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ వార్డు కార్యాలయం ప్రహరీ పక్కన శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహ స్థాపన 6వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వం రాజ్యాలను పరిపాలించిన ప్రముఖ రాజులలో శ్రీకృష్ణదేవరాయలు ఒకరని గుర్తు చేశారు. కార్యక్రమంలో సుంకర అచ్యుత రామయ్య, అరెకల రాంబాబు, ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులకు సన్మానం



మోతీనగర్: సేవా కార్యక్రమాలు చేయడానికి వయస్సుతో సంబంధం లేదని, మనసుంటే మార్గం ఉంటుందని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్ శాఖలో వయో వృద్ధులైన లయన్ ఓబుల్ రెడ్డి, జి.వి.రమణలను ఆదివారం మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు క్రమం తప్పకుండా నడక, వ్యాయామం, ప్రాణాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షులు నల్లమాల్పు అంజిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి, సభ్యులు లయన్ బ్రహ్మానందారెడ్డి, లయన్ రమేష్, కుటుంబరావు, చెల్లప్ప, వెంకటరమణ, ఎస్ఎస్ భైరెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ ర్యాంకు సాధించిన విద్యార్థినికి సన్మానం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని రామకృష్ణ వీధిలో నివాసం ఉంటున్న మూర్తి, అభిలాష దంపతుల కుమార్తె పూర్వికతెలంగాణ రాష్ట్ర మెడికల్‌లో 85వ ర్యాంకు సాధించింది. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి. పురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ విద్యార్థిని పూర్వికను సన్మానించి స్వీట్ తినిపించి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జి. ప్రసాద్, ఎస్. శ్రీధర్‌రావు, ఆర్. శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, కిశోర్, తాండవ కృష్ణ, జలంధర్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.






ఆకట్టుకున్న 'దాండియా నైట్'

దసరా పండుగను పురస్కరించుకుని రాధే కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా నైట్ కార్యక్రమం ఆకట్టుకుంది. రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో కొనసాగింది. 1000 మంది వరకు వినియోగదారులు, రాధే బృందం సభ్యులు ఉల్లాసంగా, ఉత్సాహంగా దాండియా ఆడుతూ, పాడుతూ గడిపారు. ఈ సందర్భంగా రాధే గ్రూప్ ఎండీ రాధే దగ్గుమల్ల మాట్లాడుతూ గ్రూపు సభ్యులు, వినియోగదారులను ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాధే గ్రూపు సభ్యులు, వినియోగదారులు పాల్గొన్నారు.

-రాయదుర్గం



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో రాజరాజేశ్వరి అలంకరణలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో రాజరాజేశ్వరి అలంకరణలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అమ్మవారికి జలాభిషేకం..



రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో హోమం ..



రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలోని ఆలయంలో పూజలు..

వైభవంగా దసరా వేడుకలు

- శమీపూజలు, రావణ దహనాలు
- ముగిసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

నియోజకవర్గవ్యాప్తంగా దసరా వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయాల్లో హోమాలు, అన్నప్రసాద వితరణ, సామూహిక విష్ణు, లలిత, సాయిసచ్చరిత్ర పారాయణాలు నిర్వహించారు.అలాగే భక్తిశ్రద్ధలతో అర్చకుల మంత్రోచ్చారణల మధ్య శమీ పూజలు చేశారు. మరోవైపు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కూడా ముగిశాయి. డప్పుచప్పుళ్లు, యువత , నిర్వాహకుల నృత్యాల నడుమ అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

-శేరిలింగంపల్లి జోన్ బృందం



హుడా ట్రేడ్ సెంటర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ..



టెలికాంనగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో శమీ పూజ..



టెలికాంనగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో పల్లకీసేవ..



నల్లగండ్ల అపర్ణగ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో శమీ పూజ..






నృత్యం చేస్తున్న కళాకారులు



తారానగర్‌లో దుర్గాభవానీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..




తారానగర్‌లో మాతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత ఊరేగింపు ..




రాయదుర్గంలో దుర్గామాత వేడుకల్లో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

రైతు బిడ్డ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో దిట్ట

- నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్న సుమంత్‌రెడ్డి
- ఆర్థిక ఇబ్బందులున్న లక్ష్యం వైపే..

సుభాష్‌నగర్: ప్రస్తుత రోజుల్లో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే నానా కష్టాలు పడాల్సిందే. కానీ ఆ యువకుడిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా వాటిని లెక్కచేయకుండా ఓవైపు చదువుతూ మరోవైపు ట్యూషన్లు చెబుతూ ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. కష్టపడితే చదివితే సాధించలేనిది ఏమీ ఉండదని నిరూపించాడు. సూరారానికి చెందిన మేరెడ్డి సుమంత్ రెడ్డి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఎంటెక్ పూర్తి చేసిన ఇతను మొదటగా 2020లో చదువుతూ కేంద్రానికి సంబంధించిన బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్ఓ) ఉద్యోగాల పరీక్షల్లో దేశవ్యాప్తంగా ఆరు లక్షల మంది రాయగా సుమంత్ రెడ్డి అర్హత పొంది ఉద్యోగం సాధించాడు. కానీ ఆ ఉద్యోగం వదిలేసి చదువుతూ సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రస్తుతం మైసూర్‌లో జేఈ సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూనే ఇటీవల జరిగిన టి.జి.పి.ఎస్.సిలో రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది పరీక్షలు రాయగా.. 82వ ర్యాంక్ సాధించి ఆర్అండ్‌బీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా గెజిటెడ్ హోదాలో ఉద్యోగం సాధించాడు. అదేవిధంగా పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఇలా వారం వ్యవధిలో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. దీంతో కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండా పోయింది.



సుమంత్ రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న అమ్మానాన్న

వ్యవసాయ కుటుంబం నుంచి..

నల్గొండ జిల్లా లింగోట గ్రామానికి చెందిన మేరెడ్డి భాస్కర్ రెడ్డిది వ్యవసాయ కుటుంబం. అతను 1992లో సూరారానికి వలస వచ్చాడు. స్థానికంగా ఓ ఫార్మా కంపెనీలో చిరు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇతని కుమారుడు మేరెడ్డి సుమంత్ రెడ్డి, పాప ధరణి సంతానం.

నా లక్ష్యం ఐఈఎస్...



మమ్మల్ని అమ్మానాన్న చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదివించారు. ఇంటర్ చదివేందుకు ఆర్థిక స్థోమత అంతగా లేకపోవడంతో డిప్లొమా చదివాను. ఓవైపు ట్యూషన్ చెబుతూ మరోవైపు చదువును కొనసాగించా. చదువుతూనే ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన చూసి ముందుగా 30 పరీక్షలు రాశాను. అందులో చాలా వరకు ఒకటి, రెండు మార్కుల తేడాతో సాధించలేకపోయాను. ప్రస్తుతం గెజిటెడ్ హోదాలో నాకు ఉద్యోగం వచ్చింది. అయినప్పటికీ నా ప్రయాణం ఆపేది లేదు. నా లక్ష్యం ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్(ఐఈఎస్) సాధించి తీరుతా.

- సుమంత్‌రెడ్డి

యువకుడి దారుణ హత్య

జగద్గిరిగుట్ట: పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా భూదేర ప్రాంతానికి చెందిన అక్బర్ పాషా కుటుంబం 3 సంవత్సరాలుగా జగద్గిరిగుట్టలోని దీనబంధు కాలనీలో నివాసం ఉంటుంది. కాగా అక్బర్ కుమారుడు నదీం పాషా(21) బ్యాండ్ మేళంలో పని చేస్తున్నాడు. నదీం పాషాతో స్థానికంగా ఉండే కొందరితో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ముకుమ్మడిగా నదీంపై బండరాళ్లతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు.. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నదీం సోదరి అయేషా ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నదీంను అత్యంత కిరాతంగా హత్య చేయాల్సిన బలమైన కారణం ఏమై ఉంటుందన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యలపై అలు పెరుగని పోరాటం చేసిన యోధుడు ప్రొఫెసర్ సాయిబాబా అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆదివారం జగద్గిరిగుట్ట కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు సాయిబాబా బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో హరినాథ్, బాబు, వెంకట్, ప్రభాకర్, సోమన్న, నారాయణ, దక్షిణమూర్తి, సుందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు